
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
సోమవారం 2 డిసెంబరు 2024

## 'ఫుడ్ పాయిజనింగ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కుట్రే'

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు వసతిగృహాల్లో ఫుడ్ పాయిజన్ కుట్రకు బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెరలేపారని తెలంగాణ పీసీసీ రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ చైర్మన్ రాచమల్ల సిద్దేశ్వర్ ఆరోపించారు. ఈమేరకు ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి విద్యకు ప్రాముఖ్యతనిస్తూ సంక్షేమ హాస్టళ్లలో డైట్, కాస్మొటిక్ చార్జీలను పెంచారన్నారు. విద్యార్థుల్లో విశ్వసనీయత దెబ్బతీసేందుకు కుట్రలు పన్నుతున్నాడనే విషయాన్ని గమనించాలన్నారు.


## క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితం

నిర్వహణ లేక అస్తవ్యస్తం
మైదానంలో పిచ్చిమొక్కలు దర్శనం
మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
పట్టించుకోని అధికారులు



8

## ఐక్య పోరాటాలతో హక్కుల సాధన

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వెనక్కి తీసుకోవాలి
మాల మహానాడు జిల్లా నాయకులు
ఆమనగల్లులో భారీ ర్యాలీ



8

## విద్యతోనే ప్రగతి సాధ్యం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి
మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రజా పాలన విజయోత్సవం
విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



8




# అమ్మపాటే స్ఫూర్తి

## ఆమె పాటలు వింటూ పెరిగా

- గతంలో లెక్చరర్.. ప్రమాదంతో రచయితనయ్యా
- సమాజ శ్రేయస్సు, సంస్కృతిని తెలిపేలా రచనలు
- యూట్యూబ్ చానల్ నిర్వహణ, నటనతో ముందుకు..
- నేడు పాటల రచయితగా ప్రత్యేక గుర్తింపు
- మట్టిలో మాణిక్యం బేగరి రాములుపై స్పెషల్ స్టోరీ


ప్రతీ బిడ్డకు తొలి గురువు అమ్మ.. ఆట పాటలతో లాలిస్తూ.. కొత్త మాటలు నేర్పుతూ.. బుడిబుడి అడుగులు వేయిస్తూ.. భవిష్యత్‌కు దారి చూపుతుంది అమ్మ. అలా ఓ అమ్మ తనకిష్టమైన పాటలను వినిపిస్తూ తన కొడుకుని పెంచింది. పొలం పనుల్లో, వంటింట్లో, వీధిలో ఏ శుభకార్యమైనా అమ్మపాట వినిపించేది. ప్రతీ సందర్భాన్ని పాట రూపంలోకి మార్చి అందరినీ అలరించేది. ఈ మాతృమూర్తి నైపుణ్యమే తన బిడ్డకు అబ్బింది. తల్లి పాటలు వింటూ పెరిగిన ఆ బుడతడు పెద్దయ్యాక రచయితగా మారాడు. సమాజ శ్రేయస్సు కోసం, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా పాటలు రాస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. వికారాబాద్ మండలం జైదుపల్లి గ్రామానికి చెందిన బేగరి రాములు ప్రస్థానంపై కథనం.

7

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి)

# మళ్లీ ఆదర్శ రైతు

## నియామకానికి సర్కార్ యోచన





ఆదర్శ రైతు వ్యవస్థ మళ్లీ తెరపైకి వచ్చింది. వారిని మళ్లీ నియమించాలని కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తోంది. వైఎస్ఆర్ హయాంలో అమలులో ఉన్న ఆదర్శ రైతు వ్యవస్థను బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేసింది. గతంలో ఆదర్శ రైతులు వ్యవసాయ శాఖకు, రైతులకు అనుసంధానంగా ఉండేవారు. సాగుపై మంచి పట్టు ఉన్న వీరు పొలాల వద్దకు వెళ్లి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేవారు. ఈ వ్యవస్థ మళ్లీ అమలులోకి వస్తే రైతులకు మేలు జరగడమే కాకుండా, ఏవోలకు కొంత ఉపశమనం కలిగే అవకాశం ఉంటుంది.

- ప్రతీ వెయ్యి ఎకరాలకు ఒక ఆదర్శ రైతు
- ఉమ్మడి జిల్లాలో వెయ్యి మంది వరకు ఎంపిక
- మరికొన్ని క్లస్టర్లను పెంచే యోచన
- ఆదర్శ రైతుల రాకతో ఏవోలకు ఉపశమనం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శ రైతుల వ్యవస్థను మళ్లీ తీసుకురావాలని భావిస్తోంది. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అప్పట్లో ఆదర్శ రైతుల వ్యవస్థను అమల్లోకి తెచ్చిన విషయం విదితమే. రైతులకు, వ్యవసాయశాఖకు అనుసంధానంగా పనిచేసే ఈ వ్యవస్థను దాదాపు పదేళ్ల పాటు నడిచిన తరువాత 2017లో బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసింది. అయితే తాజాగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆదర్శ రైతుల వ్యవస్థను త్వరలోనే అమల్లోకి తీసుకువస్తామని ఇటీవల ప్రకటించడంతో దీనిపై కదలిక వచ్చింది. గత గురువారం దీనిపై ఉన్నతస్థాయి సమావేశం కూడా నిర్వహించారు. రైతు సంక్షేమ కమిషన్‌తో మంత్రి తుమ్మల సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషన్ నుంచి ఆదర్శ రైతుల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు స్వీకరించారు. రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, కమిషన్ సభ్యులు కొన్ని కీలక సూచనలు చేస్తూ మంత్రికి ప్రతిపాదనలు అందజేశారు. ప్రతీ రెవెన్యూ గ్రామాన్ని ప్రాతిపదికగా తీసుకుంటూ వేయి ఎకరాలకు ఒక ఆదర్శ రైతును నియమించాలని కమిషన్ ప్రతిపాదించింది. ప్రభుత్వం దాదాపు దీన్నే ఖరారు

మిగతా 6వ పేజీలో...

**సాగు, క్లస్టర్ల వివరాలు**

| జిల్లా | సాగు సగటు విస్తీర్ణం (ఎకరాల్లో) | క్లస్టర్ల సంఖ్య |
|---|---|---|
| రంగారెడ్డి | 4.49లక్షలు | 87 |
| వికారాబాద్ | 5.81లక్షలు | 99 |
| మేడ్చల్ | 75వేలు | 9 |



## బీసీ విద్యార్థి సంఘ జిల్లా ఉపాధ్యక్షుడిగా మధు

యాచారం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా యాచారం మండలం కుర్మిద్ద గ్రామానికి చెందిన పంతం మధుయాదవ్ నియమితులయ్యారు. ఆదివారం నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌యాదవ్ నియామక పత్రం అందించారు. ఈసందర్భంగా మధుయాదవ్ మాట్లాడుతూ బీసీల హక్కుల పరిరక్షణకు పోరాటం చేయాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను బీసీల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు.

## రఘునాథ్ యాదవ్‌కు సేవారత్న అవార్డు

షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌కు చెందిన నడికూడ రఘునాథ్ యాదవ్ బహుజన సాహిత్య అకాడమీ అందించే సేవారత్న పురస్కారానికి ఎంపికైనట్లు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎం గౌతమ్ ఆదివారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నందుకు అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈనెల 15న ఢిల్లీలో జరిగే జాతీయ సమావేశాల్లో రాష్ట్రపతి, జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డు అందజేయనున్నట్లు తెలిపారు. నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎంపిక పత్రాన్ని అందజేశారు.



వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

# ప్రబలుతున్న కుష్ఠు

- చాపకింద నీరులా వ్యాధి వ్యాప్తి
- అవగాహనతోనే నివారణ
- నేటి నుంచి 15వ తేదీ వరకు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమం
- ఇంటింటి సర్వే చేయనున్న ఆశ, ఆరోగ్య కార్యకర్తలు

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠు వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తోంది. నిర్లక్ష్యం చేసిన వారి ఆరోగ్యాన్ని కబళిస్తోంది. ఏటా పదుల సంఖ్యలో కొత్త కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. వ్యాధిని అరికట్టేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కుష్ఠు నివారణ విభాగం కృషి చేస్తోంది. వ్యాధిపై అవగాహన, పాజిటివ్ దృక్పథం ఉంటేనే కుష్ఠు రహిత సమాజం నిర్మించుకోవచ్చు.

### తొలిదశలోనే చికిత్స తీసుకుంటే మేలు

సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తే పూర్తిగా అరికట్టవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు. మైక్రో బ్యాక్టీరియా లెప్రీ అనే క్రిమి కారణంగా ఈ వ్యాధి సోకుతుంది. నిర్లక్ష్యం చేస్తే శరీరంలోని అన్ని అవయవాలకు పాకే అవకాశం ఉంటుంది. ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. వ్యాధి సోకిన తర్వాత 3 నుంచి 15 ఏళ్ల తర్వాత దుష్పరిణామాలు బయటపడతాయి. తొలి దశలో వ్యాధిని నిర్ధారించుకొని ఎండీటీ చికిత్స

మిగతా 8వ పేజీలో...

### మొదట్లోనే చికిత్స తీసుకోవాలి



శరీరంపై తెల్లని, రాగి రంగులో స్పర్శ లేని మచ్చలు ఉన్నట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. దీనిని మొదట్లోనే గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా వ్యాధిని పూర్తిగా తగ్గించుకోవచ్చు. ఈ వ్యాధి సోకిన వారికి జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఉచితంగా మందులు అందిస్తారు.

డాక్టర్ పాపారావు, కుష్ఠు వ్యాధి నియంత్రణ జిల్లా అధికారి

## చేవెళ్లలో రేపు, ఎల్లుండి
# పత్తి కొనుగోళ్లు బంద్

చేవెళ్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల మండలంలోని దామరిగిద్ద వద్ద ఉన్న శ్రీనివాస కాటన్ మిల్లులో రెండు రోజుల పాటు పత్తి కొనుగోళ్లు నిలిపి వేస్తున్నట్లు చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్ తెలిపారు. ఆదివారం ఆయన చేవెళ్లలో మాట్లాడుతూ... పత్తి మిల్లు వద్ద సరిపడా స్థలం లేకపోవడంతో పాటు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున ఈనెల 2 నుంచి 3వ తేదీ వరకు పత్తిని కొనుగోలు చేయమని చెప్పారు. ఈ విషయాన్ని రైతులు గమనించి పత్తిని తీసుకురావద్దని సూచించారు. మళ్లీ ఈ నెల 4వ తేది నుంచి కొనుగోళ్లు యథాతథంగా జరుగుతాయని చెప్పారు.

## విద్యకు పెద్దపీట వేయాలి

ప్రొఫెసర్ హరగోపాల్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

షాద్‌నగర్, డిసెంబరు1:(ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధికి బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆదివారం షాద్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన విద్యా సదస్సు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. ప్రతి బడ్జెట్‌లో విద్యకు బడ్జెట్‌లో కోతలు విధించడం సమంజసం కాదన్నారు. గత పాలకుల్లా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేయాలన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా విద్యా వ్యవస్థ మాత్రం మారడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యతోనే దేశం అభివృద్ధి చెందుతున్న విషయాన్ని పాలకులు, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. విద్య మరింత అభివృద్ధి చెందాలంటే గ్రామాల్లో మెరుగైన పాఠశాలలతో పాటు, మంచి నాణ్యమైన విద్యను అందించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో గత పాలకులు విద్యను విధ్వంసం చేశారని, సర్కార్ బడుల్లో కనీసం మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించిన దాఖలాలు కూడా లేవన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో విద్యకు అత్యంత ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వ పాఠశాలలో తన సొంత నిధులతో కనీస వసతులు కల్పించానని చెప్పారు. విద్యకు ఎన్ని నిధులైన వెచ్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చంద్రారెడ్డి, టీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు మిద్దెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చేతగాకపోతే విద్యాశాఖను
# బీఆర్ఎస్‌కు అప్పగించండి

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గురుకుల విద్యాలయాల్లో అనేక సమస్యలున్నాయని, ఈ ప్రభుత్వానికి చేతగాకపోతే విద్యా శాఖను బీఆర్ఎస్ పార్టీకి అప్పగిస్తే ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా చేసి చూపుతామని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్ అన్నారు. బీఆర్ఎస్ విద్యార్థి విభాగం చేపట్టిన గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడలో కొనసాగుతున్న హయత్‌నగర్ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల/కళాశాల, వినోభానగర్‌లో ఉన్న కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే మతిస్థిమితం లేని మంత్రులతో ఎదురుదాడి చేయిస్తున్నారంటూ ఆయన విమర్శించారు. "ఎస్సీ బాలుర పాఠశాలలో లెక్చరర్లు లేరు.. భవనం సరిగా లేదు.. మరుగుదొడ్లు లేక పిల్లలు చెంబులు పట్టుకొని బయటకు పోతున్నారు" అని ఆందోళన వ్యక్తం చేశారు. 600 మంది విద్యార్థులున్న ఈ విద్యాలయంలో పడుకోవడానికి బెడ్లు కూడా లేవన్నారు. కప్పుకోవడానికి రగ్గులు లేక విద్యార్థులు చలికి వణుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాంఖేడులో చనిపోయిన శైలజ లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. వసతి గృహాల్లో ఫుడ్ పాయిజన్ జరిగి విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నా సర్కార్‌కు పట్టింపు లేదన్నారు. బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఫైవ్‌మెన్ కమిటీ సభ్యులు ఎర్రోళ్ల శ్రీనివాస్, రాజారాం యాదవ్, వాసుదేవ రెడ్డి, అంజనేయగౌడ్ ఉన్నారు.



విద్యార్థులతో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

## ఆర్ఎస్‌పీపై ఫిర్యాదు

శేరిగూడలో కొనసాగుతున్న హయత్‌నగర్‌కు చెందిన తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల/కళాశాలలోకి అనుమతి లేకుండా ప్రవేశించడమే కాకుండా ఉపాధ్యాయులను బెదిరించి విద్యార్థులను రెచ్చగొట్టేవిధంగా వ్యవహరించారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మరికొందరిపై ప్రిన్సిపాల్ డి.ధనలక్ష్మి ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీచర్లు, విద్యార్థులు మానసిక వేదనకు గురయ్యారని పేర్కొన్నారు. దాంతో పోలీసులు విచారణ చేస్తున్నారు.

## పెట్టుబడిదారుల తొత్తుగా
# మోదీ ప్రభుత్వం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకే కొమ్ము కాస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ ఆరోపించారు. ఆదివారం బొంగులూరులోని కళ్లెం జంగారెడ్డి గార్డెన్స్‌లో జరిగిన సీపీఎం మండల 9వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగ సంస్థలను ఉపయోగించుకొని ప్రతిపక్ష పార్టీలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. దేశంలో బీసీ గణన చేపట్టి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఆర్థిక సంక్షోభం, నిరుద్యోగం పెరిగిపోతున్నా సరైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ నాటి కాంగ్రెస్ పార్టీ అనుసరించిన విధానాలనే మోదీ ప్రభుత్వం అవలంబిస్తోందని విమర్శించారు. ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి కె.భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, భూదాన్ భూముల్లో రూ.1200 కోట్ల కుంభకోణం జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సామేల్, యాదయ్య, మధుసూదన్‌రెడ్డి, జగదీశ్, సీ.హెచ్.జంగయ్య పాల్గొన్నారు.





మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

## పులి కాదు.. హైనా

- ఎలిమినేడులో పులి సంచార వదంతులు
- అటవీ అధికారుల విచారణ

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామంలో పులి సంచార వదంతులు కలకలం రేపాయి. గ్రామానికి చెందిన కొట్టంల మల్లయ్య ఆదివారం తెల్లవారుజామున ఇంటి తలుపు తీసి చూడగా దూరంలో పులి సంచరిస్తున్నట్లు కనిపించింది. గ్రామస్తులకు విషయం చెప్పడంతో అటవీశాఖ అధికారులను సమాచారమందించారు. అధికారులు గ్రామానికి చేరుకొని జంతువు అడుగులను పరిశీలించారు. ఇది పులి కాదు, హైనా కావచ్చని అటవీశాఖ సెక్షన్ అధికారులు సరిత, శరణప్ప చెప్పారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ పాపారావు

## హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలె బీసీ హాస్టల్ (బాలికల) విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఐవీ వైరస్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, ఎల్బీనగర్ డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ పాపారావు, బీసీ హాస్టల్ ప్రిన్సిపల్ కవిత, దిశ మేనేజర్, సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలి

శంకర్‌పల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాల్లో భాగంగా వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డితో కలిసి శంకర్‌పల్లి మున్సిపల్‌లోని 7, 12వ వార్డుల్లో శానిటేషన్‌పై ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణ, చిన్న శంకర్‌పల్లి వెళ్లే దారిలో మురుగు కాలువలను శుభ్రం చేయించారు. చెత్తాచెదారాన్ని, ప్లాస్టిక్ కాగితాలు, సీసం ముక్కలు తదితర వాటిని సిబ్బందితో తీయించారు. ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాల్లో భాగంగా రేపు(మంగళవారం) ఉదయం 6గంటలకు శంకర్‌పల్లి చౌరస్తా నుంచి బీడీఎల్ చౌరస్తా వరకు 2కే రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కౌన్సిలర్ అశోక్, నాయకులు ప్రకాష్, ప్రవీన్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

## రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో రన్నరప్‌గా రంగారెడ్డి జిల్లా జట్టు



రంగారెడ్డి బాలలికల జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలబాలికల రగ్బీ టోర్నీలో రెండు విభాగాల్లో రంగారెడ్డి జిల్లా జట్టు రన్నరప్‌గా నిలవగా మహబూబ్‌నగర్ జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బాలుర విభాగంలో నల్గొండపై మహబూబ్‌నగర్ జట్టు 2-1 తేడాతో, బాలికల విభాగంలో రంగారెడ్డిపై మహబూబ్‌నగర్ జట్టు 2-0 స్కోర్ తేడాతో గెలుపొందాయి. బాలుర విభాగంలో నల్గొండ, బాలికల విభాగంలో రంగారెడ్డి జట్లు రన్నర్ నిలిచాయి. మూడో స్థానంలో బాలబాలికల విభాగంలో మెదక్ జట్లు నిలిచాయి. విజేతలకు ఏఎంవో దుంకుడు శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. టోర్నీ పరిశీలకులు కిష్టయ్య, ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి, టోర్నీ కార్యదర్శి నిరంజన్‌రావు, రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మళ్లీ ఆదర్శ రైతు

(5వ పేజీ తరువాయి)

చేయాలని భావిస్తోంది. రైతులకు మెరుగైన సేవలందించేందుకు ఆదర్శ రైతు వ్యవస్థను మళ్లీ అమల్లోకి తీసుకురావాలని కాంగ్రెస్ సర్కార్ భావిస్తోంది. అంతేకాక రాజకీయ కోణంలో చూస్తే రైతుల్లో పట్టుపెంచుకునేందుకు ఇది దోహదపడుతుందని కాంగ్రెస్ సర్కార్ ఆశాభావంతో ఉంది. ఇదిలాఉంటే ఆదర్శ రైతుల నియామకాలతో వ్యవసాయాధికారులకు కాస్త ఉపశమనం కలగనుంది. తమకు అదనపు పనులు అప్పగిస్తుండడంతో పని వత్తిడి ఎక్కువగా ఉందని వ్యవసాయాధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల డిజిటల్ సర్వే పనులపై ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

### ఉమ్మడి జిల్లాలో వెయ్యి మంది...

సర్కార్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలో దాదాపు వెయ్యి మంది ఆదర్శ రైతుల నియామకాలు జరగనున్నాయి. ఎంపిక చేసిన ఆదర్శ రైతులు పంటల సాగులో రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తారు. ఒక విధంగా చెప్పాలంటే వ్యవసాయశాఖకు రైతులకు అనుసంధానంగా వ్యవహరిస్తారు. రైతు వేదికల ద్వారా రైతులకు పంటల సాగులో సలహాలు, సూచనలతో పాటు పంటల బీమా, ఇతర వ్యవసాయ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. రైతులకు మెరుగైన సేవలందించేందుకు గతంలో 5వేల ఎకరాలకు ఒక క్లస్టర్ ఏర్పాటు చేసి రైతు వేదికలను నిర్మించారు. ఒక్కో క్లస్టర్‌కు ఒక వ్యవసాధికారి(ఏఓ)ని నియమించారు. అయితే కొన్ని చోట్ల శాస్త్రీయంగా జరగలేదు. రంగారెడ్డి జిల్లాలో 87, వికారాబాద్‌లో 99, మేడ్చల్ జిల్లాలో 9 క్లస్టర్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 195 క్లస్టర్లు ఉన్నాయి. అయితే సాగు భూములను పరిగణనలోకి తీసుకుంటే అదనంగా 20 నుంచి 25 క్లస్టర్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు వికారాబాద్ జిల్లాలో 5.81లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. దీని ప్రకారం చూస్తే వికారాబాద్ జిల్లాలో మొత్తం 116 క్లస్టర్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా ప్రస్తుతం 99 క్లస్టర్లు మాత్రమే ఉన్నాయి. ఇంకా అదనంగా 17 క్లస్టర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది.

### గతంలో ఇలా..

వైఎస్ హయాంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2007లో ఆదర్శ రైతు వ్యవస్థను అమల్లోకి తెచ్చింది. రైతులకు, వ్యవసాయ అధికారులకు అనుసంధానంగా పనిచేసేందుకు వ్యవసాయంలో మంచి పట్టు ఉండి కనీసం పదో తరగతి ఉత్తీర్ణత ఉన్న రైతులను ఎంపిక చేసి ఆదర్శ రైతులుగా నియమించింది. వీరికి 20 రకాల బాధ్యతలను అప్పగించారు. 250 నుంచి 300 ఎకరాలకు ఒక ఆదర్శ రైతును నియమించారు. అప్పట్లో గౌరవ వేతనం కింద వీరికి నెలకు రూ.1000 అందించేవారు. రైతులకు వీరి సేవలు ఎంతో ఉపయోగపడ్డాయి. పదేళ్ల పాటు కొనసాగిన ఆదర్శ రైతు వ్యవస్థను బీఆర్ఎస్ ప్రభుత్వం 2017లో రద్దు చేసింది. తిరిగి మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ వ్యవస్థను పునర్నిర్మించేందుకు కసరత్తు చేస్తోంది. ఆదర్శ రైతులకు రూ.3వేల వరకు గౌరవ వేతనం ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

# కాంగ్రెస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

- త్వరలోనే అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాలన విజయోత్సవాల వేడుకల్లో భాగంగా ఆదివారం ఆయన యాలాల మండలంలోని కోకట్, రాఘవాపూర్, కమాల్‌పూర్, నాగసముందర్, రాస్నం, గంగసాగర్, అచ్యుతాపూర్, ముద్దాయిపేట్ గ్రామాల్లో సీసీరోడ ప్రారంభోత్సవం, శంకస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే మహిళలకు ఫ్రీ బస్సు, రైతు రుణ మాఫీ, వంటి పథకాలను అమలు చేస్తుందన్నారు. త్వరలోనే అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌త సురేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, సిద్రాల శ్రీనివాస్, బాల్‌రెడ్డి, అక్బర్‌బాబా, భీమప్ప, సంగెం హన్మంతు, అమృతయ్య, రాజు, సత్యనారాయణరెడ్డి, రఘురాంరెడ్డి, అమర్‌నాథ్, బస్వరాజ్, అధికారులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

### నేడు ఎమ్మెల్యే పర్యటన

తాండూరు రూరల్: ఏడాది ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా నేడు(సోమవారం) తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పర్యటించనున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జర్నె నాగప్ప పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎమ్మెల్యే పర్యటన కొనసాగనుంది.

## ఫార్మాసిటీ రద్దుకు శాంతియుత పోరాటం

ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ



కాజుపల్లిలో పర్యటిస్తున్న నాయకులు, రైతులు

యాచారం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో విషపూరితమైన ఫార్మాసిటీని రద్దు చేసేదాకా శాంతియుతంగా పోరాటం చేస్తామని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు, రైతులు ప్రకటించారు. గత ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం పేదల భూములు తీసుకుంటే.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాసిటీని రద్దు చేస్తామని నయవంచన చేసిందని మండిపడ్డారు. ఆదివారం ఆయా గ్రామాలకు చెందిన 120 మందితో కూడిన బృందం రెండు బస్సుల్లో పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతాల్లో, సంగారెడ్డి జిల్లా కిష్టయపల్లి, కాజుపల్లి, గడ్డపోతారం, పాషామైలారం తదితర గ్రామాల్లో పర్యటించింది. గ్రామాల రైతులను కలిసి వారి గోడు ఆలకించారు. విషపూరితమైన కంపెనీల నుంచి వెలువడే నీటితో చెరువులు, కుంటలు, భూగర్భజలం కలుషితమైందని కాజుపల్లి, గడ్డపోతారం పాషామైలారం గ్రామాల రైతులు తెలిపినట్లు వారు నాయకులు తెలిపారు. తమ ప్రాణం పోయినా మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఫార్మాకంపెనీలు ఏర్పాటు చేయనివ్వబోమని ఫార్మాసిటీ వ్యతిరేకపోరాట కమిటీ కన్వీనర్ కవుల సరస్వతి, సభ్యులు మహిపాల్‌రెడ్డి, బర్లమల్లేష్ తదితరులు తెలిపారు. ఫార్మాసిటీ రద్దుకు విపక్షాలు తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. త్వరలో ఫార్మాసిటీ రద్దుకు ఉద్యమం లేవదీస్తామని తేల్చి చెప్పారు.

## కులగణనకు న్యాయం చేయండి



కార్యక్రమంలో బీసీసేన నాయకులు

షాద్‌నగర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణన చేయడాన్ని సమర్థిస్తున్నామని, ఆచరణలో అందరికీ న్యాయం చేసేలా దానిని అమలు చేయకుంటే ఫలితం ఉండదని వివిధ పార్టీల నాయకులు సూచించారు. ఆదివారం షాద్‌నగర్ నియోజకవర్గంలో బీసీసేన ఆధ్వర్యంలో కులగణనపై పార్టీల నాయకులతో చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలా పేపర్లకే పరిమితం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికార పార్టీకి చెందిన బీసీలదేనని అన్నారు. ఎన్నికలప్పుడు ఓట్లు, డబ్బులు పంచడానికే మనమే కావాలి కానీ, సీటు మాత్రం రాదని, ఇదెక్కడి న్యాయమని, బీసీల కుర్చీలపై అగ్రకులాల కబ్జా ఇంకెన్నాళ్లు అని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాబయ్య, బీజేపీ జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణయ్య, రాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షులు రాము, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీఎస్పీ, డీఎస్పీ నాయకులు నర్సింగ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సిహ మాదిగ, బీసీసేన రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్, రాజు, నరేష్, మల్లేష్, కృష్ణ, రాజునాయక్, వికలాంగుల సంఘం, బీసీసేన తదితరర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేతలది విష ప్రచారం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పదేళ్ల కష్టాలకు విముక్తి లభించి తమకు మేలు జరుగుతుందని రైతులు ఆనందంగా ఉంటే.. విపక్షాలు జీర్ణించుకోలేక విషప్రచారాలు సాగిస్తున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చిన పది నెలల్లో రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత దేశ చరిత్రలో కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కడ్తాల మండలం మైసిగండి ఎంఆర్‌జీ గార్డెన్‌లో ఆదివారం పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ గీతనర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి బీడు భూములకు సాగునీరందించడానికి సీఎం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు హీరాసింగ్, ఆమనగల్లు మాజీ వైస్ ఎంపీపీ అనంత రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు జవహర్‌లాల్ నాయక్, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, తదితరులున్నారు.

## జిల్లా కేంద్రంలో గురుకులాలు అధ్వానం



విద్యార్థులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గురుకులాలు అధ్వాన్నంగా మారాయని, విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు, జిల్లా ఇన్‌చార్జి జంగయ్య అన్నారు. బీఆర్ఎస్వీ నాయకులతో కలిసి ఆదివారం అనంతగిరిపల్లి, కొత్తగడి, మైనార్టీ గురుకుల పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పాఠశాలలో గతంలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని అధికారులు, పాలకులు సైతం సందర్శించినా పరిశుభ్రత లేదని, మరుగుదొడ్లు, కిచెన్ సరిగ్గా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొన్ని పాఠశాలలో కావాలని లోపలికి వెళ్లనివ్వడం లేదని మండిపడ్డారు. ఇంకా ప్రైవేటు భవనాల్లో వసతి గృహాలు కొనసాగుతున్నాయని వాటికి పక్కాభవనాలు నిర్మించాలని కోరారు. విద్యార్థుల పక్షాన బీఆర్ఎస్వీ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంచన్‌పల్లి సురేష్, కృష్ణ, సురేష్, రాజు, వరుణ్, ఫేరోజ్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే వంతెన పనులు పూర్తి చేయాలి

### ఘట్‌కేసర్‌లో స్థానికుల రిలే నిరాహార దీక్షలు



రిలే నిరాహార దీక్షలు చేపట్టిన స్థానికులు

ఘట్‌కేసర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో నత్తనడకన నడుస్తున్న రైల్వేవంతెన నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. గత 15సంవత్సరాల నుంచి వంతెన నిర్మాణ పనులు నత్తనడకన నడుస్తున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా వంతెన పనులు పూర్తవడంలేదని, తక్షణమే పనులు పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తీర్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఘట్‌కేసర్ పట్టణం మీదుగా ఆర్టీసీ బస్సులు రాకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా దీక్షాశిబిరాన్ని బీజేపీ, బీఆర్ఎస్, టీడీపీ నాయకులు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ.. వంతెన నిర్మాణంపై అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి పనులు ప్రారంభించి త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఫోర్త్‌సిటీతో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న కేఎల్లార్

కందుకూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో నిర్మించతలపెట్టిన ఫోర్త్‌సిటీతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, ఓఆర్ఆర్ నుంచి 300 ఫీట్ల రోడ్డు వల్ల రైతుల భూములకు ఊహించని రీతిలో ధరలు పెరుగుతాయని, దీనిపై విపక్షాలకు అవగాహన లేక విమర్శలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) అన్నారు. ఆదివారం కందుకూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక్కశాతం భూమి రోడ్డు మార్గానికి పోయినా.. వేల ఎకరాల భూములకు పదింతల ధరలు పెరిగి రైతులు కోటీశ్వరులవుతారని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు ఫోర్త్‌సిటీ అభివృద్ధిపై అవగాహన లేకపోవడం వల్ల అన్నదాతలను రెచ్చగొట్టే కుట్రలు చేస్తున్నారని.. ఇది మంచిది కాదని మండిపడ్డారు. భవిష్యత్తు తరాల అవసరాల దృష్ట్యా పెద్దరోడ్డులోనే మెట్రో, అండర్‌గ్రౌండ్ పవర్, డ్రైనేజీలు వేస్తామని వివరించారు. విపక్షాల నాయకుల మాయమాటలు నమ్మి మోసపోరాదని రైతులను కోరారు. విపక్షాల కారణంగా అభివృద్ధికి దూరం కావద్దని చెప్పారు. ల్యాండ్ ఫూలింగ్ ద్వారా మార్కెట్ ధరతో పాటు రైతులకు ఆమోదయోగ్యమైన ఇంటి స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వాన్ని ఒప్పిస్తామని తెలిపారు.

## మెరిట్ సాధించడానికి సరిహద్దులుండవు





కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీకృష్ణ ప్రదీప్

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మెరిట్ సాధించడానికి ఎలాంటి సరిహద్దులుండవని ట్వంటీఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ శ్రీకృష్ణ ప్రదీప్ అన్నారు. ఇబ్రహీంపట్నంలోని విశ్వేశ్వరయ్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ట్వంటీఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ సహకారంతో వింగ్స్ మీడియా, జీ మీడియా గ్రూప్‌తో కలిసి ఆదివారం 'మొదటి ప్రయత్నంలో సివిల్ సర్వీసెస్ సాధించడం ఎలా' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ ప్రదీప్ ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్‌ను ఉదహరిస్తూ మాట్లాడారు. మహిళా అధికారిగా ఆమె సమాజానికి తెలంగాణలో పదేళ్ల పాటు విశేషమైన సేవలందించారని తెలిపారు. ట్వంటీఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చీఫ్ మెంటార్ డాక్టర్ భవానీ శంకర్ మాట్లాడుతూ యూపీఎస్సీ పరీక్షల్లో ప్రాథమిక పాఠశాల ప్రశ్నలు ఉంటాయని, క్లిష్టమైన ప్రశ్నలతో కూడుకున్నదనే అపోహ వీడాలని తెలిపారు. కళాశాల చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ట్వంటీఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ సహకారంతో సివిల్ ఆస్పిరెంట్స్ క్లబ్‌ను ప్రారంభించినట్లు ప్రకటించారు. సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి, డైరెక్టర్ జనార్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో అస్తవ్యస్తంగా పాలన



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రత్నం

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఒక మాట మాట్లాడితే.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరో మాట మాట్లాడుతున్నారని.. ఇక మంత్రులు ఏం మాట్లాడుతున్నారో తెలియని పరిస్థితి నెలకొందని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అస్తవ్యస్తంగా సాగుతోందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కేఎస్ రత్నం మండిపడ్డారు. ఆదివారం మండలంలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలోని కంజర్ల ప్రకాష్ కార్యాలయంలో బీజేపీ మండలాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశంలో రత్నం మాట్లాడుతూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఆరు గ్యారంటీల హామీని ఇచ్చిందని.. అమలు చేయకముందే కొత్తగా పథకాలను తీసుకువస్తామని ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును తీసుకువచ్చి పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిపి వేసిందని. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇటువైపు కన్నెత్తి చూడలేదని.. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా దాని పేరే ఎత్తడం లేదని ప్రజలు గమనించాలని సూచించారు. కాంగ్రెస్ హామీలను అమలు చేయాలని రేపటి(సోమవారం)నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల, డివిజన్ స్థాయి అధికారులకు మెమోరాండం ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్, మండలాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, తదితరులున్నారు.

# అమ్మపాటే స్ఫూర్తి

- ఆమె పాటలు వింటూ పెరిగా
- గతంలో లెక్చరర్ ప్రమాదంతో రచయితనయ్యా
- సమాజ శ్రేయస్సు, సంస్కృతిని తెలిపేలా రచనలు
- యూట్యూబ్ చానల్ నిర్వహణ, నటనతో ముందుకు
- నేడు పాటల రచయితగా ప్రత్యేక గుర్తింపు
- మట్టిలో మాణిక్యం బేగరి రాములుపై స్పెషల్ స్టోరీ



గొర్లకాసే మామ కొడుకా సాంగ్ షూటింగ్‌లో టీం సభ్యులతో బేగరి రాములు

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జైదుపల్లికి చెందిన రాములు ఎంఏ బీఈడీ పూర్తిచేసి వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేశారు. అయితే ఆయన చిన్నప్పటి నుంచి అమ్మ పాటలు వింటూ పెరగడంతో వాటిపై మక్కువ పెరిగింది. బీఎడ్ చేసే సమయంలోనే పాటలు రాయడం మొదలుపెట్టారు. తొలిపాట బతుకమ్మపై రాశారు. అదే సమయంలో ఓ ప్రమాదంలో రాములు కాలుకు తీవ్రగాయమైంది. కాలికి ఆపరేషన్ చేసిన డాక్టర్లు ఎక్కువ సేపు నిలబడొద్దని సూచించారు. దీం తో రాములు లెక్చరర్ వృత్తికి స్వస్తి పలికారు. ఈ క్రమంలో తనకిష్టమైన పాటలు రాయడానికి పూర్తి సమయాన్ని కేటాయించారు. అమూల్య చానల్‌కు తొలిసారి రాసి పా డిన బతుకమ్మ పాటకు మంచి స్పందన వచ్చింది. ఆ పాటకు 3.5మిలియన్ల వ్యూస్ రావడంతో రాములుకు పాటలు పాడాలనే ఆసక్తి మరింత పెరిగింది.

### సొంతంగా చానల్..

ఇతర చానళ్లకు పాటలు రాసేబదులు సొంతంగా తన కంటూ ఓ చానల్ ఉంటే బాగుంటుందని రాములుకు ఆలోచన చేశారు. దీంతో వీఆర్5(వికారాబాద్ రాములు 5) పేరుతో చానల్ పెట్టి 'గొర్లుకాసే మామ కొడుకా' అనే ఫోక్ సాంగ్, 'జెమ్మా జెమా జెమాదండా' మొహర్రం పాట, 'పొద్దు పొడుపుల్లోనే ఉదయించే సూర్యుడా' అంబేడ్కర్ సాంగ్, తన తల్లి చిన్నప్పుడు పాడిన పాట 'అల్లో నేరడల్లో' కొట్నం పాట, మహిళల రక్షణ కోసం.. 'రక్షణలేని దేశంలోకి నన్నెందుకిచ్చావు శివుడా?' కుటుంబ బంధం వివరించే 'రమమల్లెల్లో రామా' పాట, అల్లో నేరడల్లో బతుకమ్మ పాటలు పాడి అలరించారు. తాజాగా 'భగవంతా నా రాతెట్ల రాశావు? పేదవాడిగా నన్ను ఎందుకు పుట్టించావు?' అనే పాటను రాసి విమర్శకుల ప్రశంసలు పొందాడు.

### బాలికలపై జరిగిన అఘాయిత్యాలకు చలించి..

ప్రమాదం తరువాత ఇంట్లో ఉంటున్న రాములును వరంగల్‌లో జరిగిన ఓ మైనర్‌పై జరిగిన అఘాయిత్యం, జమ్మూ కశ్మీర్‌లో జరిగిన మరో ఘటన కలిచి వేశాయి. 'కూర్చున్న స్థానంలోనే రాలుతున్నయమ్మా పువ్వులు' అనే పాటను రాసి అశ్విని అఫీషియల్ అనే చానల్‌కు అందించాడు. ఆ పాటను ఏకంగా ఏడు లక్షల మంది చూసి రాములు పాటకు పట్టం కట్టారు. ప్రతి నోటా ఈ పాట వినిపించేలా చేసింది.

### ప్రతిభకు పురస్కారం

తాజాగా ధనికుడికి పేదవాడికి మధ్య ఉన్న అంతరాన్ని వివరిస్తూ పాడిన పాట 'భగవంతా నా రాతెట్ల రాశావు'కు మంచి ఆదరణ లభిస్తోంది. ఈ పాటకు సృజన ఆర్ట్స్ క్రిషియన్స్ అవార్డు వరించింది. ఆ పాటలో రాములు స్వయంగా నటించి మెప్పించారు. ప్రస్తుతం యువత ప్రేమ పాటలు, డీజే సాంగ్స్‌పై మక్కువ చూపిస్తున్నా.. సమాజంలో జరుగుతున్న సంఘటనలు, మార్పులు, సంస్కృతి సంప్రదాయాలను గుర్తుచేసేలా పాటలు పాడుతూ రాములు ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే రాములును పుడమి సాహితీ వేదిక ద్వారా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ జాతీయ పురస్కారం కూడా వరించింది.

### అమ్మ బతికుంటే గొప్ప సింగర్‌ను చేసేవాడిని



చిన్నప్పుడు అమ్మ పాడిన పాటలు వింటూ పెరిగా. ఇప్పుడు అమ్మ ఉంటే ఆమెను పెద్ద సింగర్ చేసేవాడిని. కానీ ఆ అవకాశం ఇప్పుడు ఎంతోమందికి ఇస్తున్నా. నా కొడుకు అవినాష్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. వాడికీ పాటలంటే ఇష్టం. ఇకముందూ సమాజానికి ఉపయోగపడే పాటలే రాయాలని ఉంది. బతుకమ్మ పాటలు అంటే సిరిసిల్ల, కరీంనగర్ ఇతర ప్రాంతాలే అనుకుంటారు. కానీ మన వికారాబాద్ కూడా అందులోభాగమే అనేలా పాటలు రాస్తున్న. హైదరాబాద్‌కు వికారాబాద్ సమీపంలోనే ఉంది. అయినా వికారాబాద్ వారు ఉన్నారు. వికారాబాద్ గురించి ప్రతీ ఒక్కరికి తెలిసేలా వికారాబాద్ గొప్పతనంపై నాయకులను మేల్కొపేలా పాటలు రాయాలని ఆలోచిస్తున్నా. ఆ దిశగా ముందుకు వెళుతున్న. వీఆర్5 చానల్‌కు ప్రస్తుతం 21వేలకుపైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఇప్పటి వరకు 5మిల్లియన్ల వ్యూస్ ఉన్నాయి. ఇక ముందు కూడా మంచి పాటలతో మీ ముందుకు వస్తా.

- బేగరి రాములు, పాటల రచయిత, జైదుపల్లి

## స్థానికత ఆధారంగా బదిలీలు చేపట్టాలి

ఆమనగల్లు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానికత ఆధారంగా బదిలీలు చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసి ఇచ్చినమాటను నిలుపుకోవాలని ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. 317 జీవో లో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. స్థానికత కోల్పోయిన వారికి న్యాయం చేయడానికి ఏర్పాటు చేసిన సబ్ కమిటీ నివేదికలో స్థానికత అంశం లేకపోవడం విచారకరమన్నారు. సంబంధం లేని స్పౌజ్, మ్యూచువల్, మెడికల్‌కు సంబంధించిన జీవోలు విడుదల చేయడాన్ని వారు ఖండించారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె. మల్లేశ్, నాగర్‌కర్నూల్ జిల్లా బాధ్యులు శ్రీనివాస్, కార్యదర్శి అలివేలు, సభ్యులు కల్పన, శ్రీను, చంద్రశేఖర్, నర్సింహ, సత్యారాములు, రవి తదితరులు పాల్గొన్నారు.

## 31వ రోజుకు చేరిన రిలే దీక్షలు

తలకొండపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం గట్టిప్పలపల్లి గ్రామస్థులు ఆందోళన ఉధృతం చేశారు. మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు కోసం జేఏసీ ఆధ్వర్యంలో గట్టిప్పలపల్లి గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 31వ రోజుకు చేరాయి. దీక్షలో జేఏసీ నాయకులు, గ్రామ నేతలు కూర్చున్నారు. దీక్షలకు సంఘీబావంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్ చంద్ర, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక నిధులతో మారనున్న పాలమూరు రూపురేఖలు

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక నిధులతో ఉమ్మడి పాలమూరు జిల్లా రూపురేఖలు మారుతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఈమేరకు రైతు పండగ సభలో సీఎం నిధులు కేటాయించనున్నట్లు ప్రకటించడంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాకు కేటాయించనున్న రూ.20వేల కోట్లతో ఉమ్మడి జిల్లా సస్యశ్యామలం అవుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శంకర్ మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు మిగిలింది అప్పులు, ఆత్మహత్యలేనని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రూ.21వేల కోట్ల రుణమాఫీ చేయడం ఉమ్మడి ఏపీ చరిత్రలో ఇదే తొలిసారి అన్నారు. గతంలో సోనియాగాంధీ నేతృత్వంలో ప్రధని మన్‌మోహన్‌సింగ్, అప్పటి సీఎం వైఎస్ఆర్ దేశవ్యాప్తంగా రూ.70వేల కోట్ల రుణమాఫీ చేశారని, సీఎం రేవంత్‌రెడ్డి ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే రూ.21వేల కోట్ల రుణమాఫీ చేయడం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. రుణమాఫీ, రైతు భరోసా, ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వడంతో రైతుల్లో మరింత ఆత్మవిశ్వాసం పెరిగి వ్యవసాయం వైపు పూర్తి దృష్టి సారిస్తున్నారని చెప్పారు. పాలమూరు జిల్లాకు ప్రత్యేకంగా కేటాయించిన నిధులతో రంగారెడ్డి జిల్లాలో చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయడంతో పాటు, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్, నారాయణపేట, తదితర ప్రాజెక్టులపై సీఎం దృష్టి కేంద్రీకరించనున్నట్లు పేర్కొన్నారు. పదేళ్ళ పాలనలో రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేసిన బీఆర్ఎస్ దీక్షా దివస్ వంటి కార్యక్రమాలు చేపట్టడం సముచితం కాదన్నారు. ఏఎంసీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వం, నేతలు రఘు నాయక్, చెంది తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు మైసిగండి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

కడ్తాల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జాతీయ స్థాయి కబడ్డీ, చెస్ పోటీలకు ఎంపికయ్యారు. రామావత్ రాజేందర్, గౌతమ్, ప్రదీప్‌లు అండర్-14 కబడ్డీ, సిద్దు చెస్ పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం హెచ్ఎం బాల్‌రాజ్ అధ్యక్షతన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అతిథిగా హాజరై ఎంఈవో సత్యనారాయణ, మార్కెట్ చైర్‌పర్సన్ గీతనర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్‌లతో కలిసి విద్యార్థులను సత్కరించి అభినందించారు.



ధారూరులో నిర్వహించిన సభలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వడ్ల నందు

## రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

బంట్వారం (కోట్‌పల్లి)డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ వికారాబాద్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి విమర్శించారు. బంట్వారం, కోట్‌పల్లి మండల కేంద్రాల్లో ఆదివారం బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందన్నారు. రైతులు పంటల పెట్టుబడులకు వడ్డీకి అప్పులు తెచ్చి వ్యవసాయం చేస్తున్నారని, దీనికి తోడు అధిక వర్షాలు పడడంతో రైతులు వేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. వారికి కనీసం ప్రభుత్వం రైతుబంధు వేసి ఉంటే బాగుండేదన్నారు. రుణమాఫీ కోసం ఎంతోమంది రైతులు ఎదురుచూస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతున్నా హామీల అమలు చేయడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మండల అధ్యక్షుడు మహేష్, కృష్ణయాదవ్, రొంపల్లి మాజీ ఎంపీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు మల్లేశం, శరణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, బంట్వారం మండలంలోని సల్బత్రాపూర్ గ్రామానికి చెందిన ఎక్కలి రామయ్య మృతిచెందగా ఆయన అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.4వేలు అందజేశారు.

### ధారూరులో బీజేపీ బైక్ ర్యాలీ

ధారూరు: ఆరుగ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యంపై బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ధారూరులో బైక్ ర్యాలీ నిర్వహించారు. హనుమాన్ ఆలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు పార్టీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చౌరస్తాలో జరిగిన సభలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి, నాయకులు పాండుగౌడ్, రమేశ్, రాజునాయక్, వి.నందు, రాజేందర్‌గౌడ్ తదితరులు మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీల గారడీ, 66 మోసాలుగా రేవంత్‌రెడ్డి పాలన ఉందని విమర్శించారు.

## గత ప్రభుత్వ నిర్ణయాలకు రెవెన్యూ ఉద్యోగులు బలి

- రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి
- తూంకుంటలో వీఆర్‌వోల ఆత్మీయ సమ్మేళనం





ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

శామీర్‌పేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తీసుకున్న ఆశాస్త్రీయమైన నిర్ణయాల వల్ల రెవెన్యూ ఉద్యోగులు బలయ్యారని, రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం తూంకుంటలోని మొగుళ్ల వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు గరిక ఉపేందర్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయిలో పూర్వ వీఆర్వోల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వీఆర్వోల వ్యవస్థను బలోపేతం చేస్తామని అన్నారు. ఇదివరకు వీఆర్వోలుగా చేసిన వారిని తిరిగి యథావిధిగా వీఆర్వోలుగా విధుల్లోకి తీసుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నారని ఆయన వివరించారు. తాను రాష్ట్రంలోని ప్రతి ఒక్క రెవెన్యూ ఉద్యోగికి తప్పని సరిగా అండగా ఉంటానని అన్నారు. తనను పక్కకు పెట్టడానికి గత బీఆర్ఎస్ పాలకులు ఎన్నో కుట్రలు పన్నారని ఆరోపిస్తు ఆయన విచారం వ్యక్తం చేశారు.

### గత పాలకుల కుటిల ప్రయత్నం

వీఆర్వోలు చేసిన తప్పులు చాలా చిన్నవని వారిని రాబందులా, రాక్షసుల్లా గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పాలకులు చిత్రికరించారని ధ్వజమెత్తారు. తనను రెవెన్యూ శాఖ నుంచి తప్పించడానికి ఎన్నో కుటిల ప్రయత్నాలు చేశారని ఆందోళన వ్యక్తంచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగ సంఘాల నేతలు పాలకుల అడుగులకు మడుగులు వత్తి ప్రభుత్వ భూములను దర్జాగా ఆక్రమించి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. రెవెన్యూ శాఖలో ఆదాయం ఎలా పెంచుకోవాలో తాను వివరంగా సీఎం రేవంత్‌రెడ్డికి, ఇతర మంత్రులకు వివరించినట్లు ఆయన వెల్లడించారు. గ్రామాలకు, మండలాలకు మధ్య వారధిగా ఉండే విధంగా అడిషనల్ ఆర్ఐగా వీఆర్వోలను విధులోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరినట్లు లచ్చిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పీవీ మోహన్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్‌రావు, ప్రధాన కార్యదర్శి పాండునాయక్, తదితర నాయకులు, రాష్ట్రంలోని వివిధ మండలాలకు చెందిన వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.



## కవితను కలిసిన ఉప్పల

తలకొండపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆదివారం మిషన్ భగీరథ మాజీ వైస్‌చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈనెల 8న తలకొండపల్లి చౌరస్తా వద్ద నిర్వహించే తన కుమారుడు డాక్టర్ ఉప్పల అనిల్‌భావనల రిసెప్షన్‌కు హాజరుకావాలని కోరినట్లు వెంకటేశ్ తెలిపారు.

## రిజర్వేషన్లు అమలు చేయాలి

శంకర్‌పల్లి, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే ఎమ్మార్పీస్ రిజర్వేషన్లను అమలు చేయాలని ఎమ్మార్పీస్ జిల్లా ఉపాధ్యాక్షుడు ప్రవీన్ కుమార్ డిమాండు చేశారు. శంకర్‌పల్లిలోని అతిథిగృహంలో ఆదివారం రోజున మండల ఎమ్మార్పీస్ అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదిగల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలను మోసం చేయడం మానుకోవాలని హితవుపలికారు. త్వరలో నూతన కమిటీలను వేసి ఎమ్మార్పీస్ ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు. నాయకులు భానుప్రసాద్, ప్రశాంత్, నర్సింలు, ప్రశాంత్, పరశురామ్, హరీష్, ప్రవీన్ తదితరులు ఉన్నారు.

# బోర్డులకే పరిమితం

- నిర్వహణ లేక వెలవెలబోతున్న క్రీడా ప్రాంగణాలు
- పిచ్చిమొక్కలతో నిండిన మైదానాలు
- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని సర్కారు.. నిరాశలో క్రీడాకారులు




కేశంపేటలో చెత్తాచెదారంతో నిండిపోయిన క్రీడా ప్రాంగణం

కేశంపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామంలో పిల్లలకు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడానికి, యువత తాము ఎంచుకున్న క్రీడల్లో నైపుణ్యం పొందడానికి గత ప్రభుత్వం తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. అప్పటివరకు గ్రామాల్లో క్రీడా మైదానాలు లేక ప్రైవేటు స్థలాలు, ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో ఆడుకునే యువతీ యువకులు క్రీడా ప్రాంగణాల్లో ఆడుకోవచ్చని సంబురపడ్డారు. క్రీడా ప్రాంగణాల బోర్డులు చూసి త్వరలో క్రీడా పరికరాలు, సామగ్రి వస్తాయని ఆశించారు. కానీ, క్రీడా ప్రాంగణాల్లో పరికరాల ఊసేలేదు. కేవలం క్రీడా ప్రాంగణాల పేరిట బోర్డులు మాత్రమే దర్శనమిస్తున్నాయి. యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారిలోని క్రీడా నైపుణ్యాలను వెలికి తీయాలనే ప్రభుత్వ లక్ష్యం ఉన్నతంగా ఉన్నా క్షేత్రస్థాయిలో అధికారులు, నాటి ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోయింది. దాంతో లక్షలు వెచ్చించి నెలకొల్పిన క్రీడా ప్రాంగణాలు అలంకార ప్రాయంగానే మిగిలిపోయాయని, కొత్త సర్కారైనా పట్టించుకుని సౌకర్యాలు కల్పించడం ద్వారా అందుబాటులోకి తీసుకరావాలని క్రీడాకారులు కోరుతున్నారు. క్రీడా ప్రాంగణాలలో వాలీబాల్, ఖోఖో, లాంగ్‌జంప్, కబడ్డీ ఆటలాడుకోవడానికి అనువైన కోర్టులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. యువకులు వ్యాయామం చేయడానికి సింగిల్, డబుల్ బార్లు ఏర్పాటు చేయాలి. క్రీడా ప్రాంగణం చుట్టూ నాటే మొక్కలను రెండేళ్లపాటు సంరక్షించేందుకు ఓ వాచ్‌మెన్‌ను నియమిస్తామని చెప్పారు. ప్రభుత్వం చెప్పినా ఏ ఒక్క అంశం అందుబాటులో లేకపోవడం, పూర్తి స్థాయిలో క్రీడా సామగ్రిని ఏర్పాటు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. కేశంపేట మండలంలో 29 గ్రామ పంచాయతీలకు గాను 23 జీపీల్లో క్రీడా ప్రాంగణాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కేశంపేట మండల కేంద్రంతోపాటు సంగెం, పుట్టోనిగూడ, కొత్తపేట, పాపిరెడ్డిగూడ, లేమామిడి వెలసిన వెంచర్లలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. వేముల్‌నర్వ, చింతకుంటపల్లి, తొమ్మిదిరేకుల గ్రామాల్లో ఊరికి దూరంగా ఉండడంతో మందుబాబులకు అడ్డగా మారాయి. లిక్కర్‌ను సేవించి అక్కడే బాటిళ్లను పడవేస్తున్నారు. నిర్వహణ లేకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి.



వేముల్‌నర్వలో పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న క్రీడా ప్రాంగణం

### మందుబాబులకు అడ్డాగా మారాయి



క్రీడా ప్రాంగణాలు మందుబాబులకు అడ్డగా మారాయి. గ్రామానికి దూరంగా వెంచర్లలో ఉండడంతో మందుబాబులు అక్కడ లిక్కర్, బీర్లు సేవిస్తున్నారు. మరి కొంత మంది ఖాళీ బీర్ సీసాలను పగలగొడుతున్నారు. క్రీడల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన మైదానాలను అందుబాటులోకి తేవాలి. క్రీడాకారులను ప్రోత్సహించాలి.

**- నక్క గోపాల్, టెన్నిస్ క్రీడారుడు, కేశంపేట**



ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

## ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలి

షాద్‌నగర్, డిసెంబరు1: (ఆంధ్రజ్యోతి) ఎయిడ్స్ పట్ల ప్రజలు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రి నుంచి పట్టణ ప్రధాన కూడలి వరకు నిర్వహించిన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విజయలక్ష్మి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపై ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు ప్రజలకు సంపూర్ణమైన అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యూకేటర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసు కిష్టయ్యకు నివాళి



శంకర్‌పల్లి : నివాళులర్పిస్తున్న జ్ఞానేశ్వర్ తదితరులు

శంకర్‌పల్లి/కందుకూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ తొలి అమరుడు పోలీసు కిష్టయ్య సేవలు మరువలేనివని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ అన్నారు. శంకర్‌పల్లిలోని ముదిరాజ్ సంక్షేమ భవన్‌లో ఆదివారం కిష్టయ్య 15వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తలారి మైసయ్య, ఉపాధ్యక్షుడు మన్నె వెంకటేష్, బీసీ సెల్ అధ్యక్షుడు మన్నె లింగం. నాయకులున్నారు. అలాగే పోలీస్ కిష్టయ్య ఆశయ సాధనకు యువత కృషి చేయాలని కందుకూరు మండల ముదిరాజ్ సంఘ నాయకులు కాకి రాములు, దేవేందర్, శ్రీధర్‌లు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో కిష్టయ్య చిత్రపటానికి పలువురు ముదిరాజ్ సంఘ నాయకులు నివాళులర్పించారు.

# ప్రబలుతున్న కుష్ఠు

(5వ పేజీ తరువాయి)

తీసుకుంటే అంగవైకల్య బారిన పడకుండా ఉండే అవకాశం ఉంటుంది. శరీరంగా ఎరుపు, రాగి రంగు స్పర్శలేని మచ్చలుంటే పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం.

### జిల్లాలో ఇది పరిస్థితి..

జిల్లాలో కుష్ఠు వ్యాధి కేసులు ఏటేటా పెరుగుతున్నాయి. గతేడాది 2,425 అనుమానితులకు పరీక్షలు చేయగా అందులో పీబీ-12, ఎంబీ-171 ఉన్నట్లు తేలింది. వీరందరికీ చికిత్సలు పూర్తి చేశారు. ఈ ఏడాది 3,268 మంది అనుమానితులకు పరీక్షలు చేయగా అందులో పీబీ-6, ఎంబీ-90 కేసులు వెలుగు చూశాయి. పీబీ-6 కేసులకు చికిత్సలు పూర్తి చేయగా ఎంపీ-74 మంది చికిత్సలు పొందుతున్నారు.

### వ్యాధి లక్షణాలు

మైకో బ్యాక్టీరియం లెప్రి అనే సూక్ష్మక్రిమి ద్వారా కుష్ఠు వ్యాధి సంక్రమిస్తుంది. శరీరంపై తెల్లని, రాగి రంగులో స్పర్శలేని మచ్చలు ఉంటే దానిని వ్యాధి లక్షణంగా చెప్పవచ్చు. ఐదు కన్న తక్కువ మచ్చలు ఉంటే పాసీ బెసలరీ లెప్రసీ అని, ఐదు కన్న ఎక్కువ ఉంటే మల్టీ బెసలరీ లెప్రసీ అని చెప్పవచ్చు. అరచేతిలో, అరికాళ్లలో కండరాల బలహీనత, అంగవైకల్యం వంటివి కనిపిస్తాయి.

### చికిత్స విధానం..

కుష్ఠు వ్యాధి బారిన పడిన వారి శరీరంపై తెల్లని రాగి రంగులో ఐదు కన్నా తక్కువ మచ్చలు ఉంటే వారు ఆరు నెలల పాటు (మల్టీ డ్రగ్ థెరపీ-ఎండీటీ) బహుళ ఔషధ చికిత్స విధానం తీసుకోవాలి. ఐదు కంటే ఎక్కువ స్పర్శ లేని మచ్చలు ఉంటే ఏడాది కాలంపాటు చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. దీనిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకోవాలి.

### ఉచిత సేవలు, మందులు..

మల్టీడ్రగ్ థెరపీతో కుష్ఠు వ్యాధిని నయం చేసుకోవచ్చు. పాసిబాసిల్లరీ (పీబీ) కుష్ఠుకు ఆరు నెలల పాటు డాప్సోన్, రిఫాంపిసిన్, క్లోఫాజిమైన్ మందులతో మల్టీ చికిత్స అందిస్తారు. ఇవే మందులతో మల్టీబాసిల్లరీ (ఎంబీ) వ్యాధిగ్రస్తులకు 12 నెలల పాటు చికిత్స అందిస్తారు. కుష్ఠు వ్యాధితో బాధపడే వారికి ప్రభుత్వం ఉచితంగా వైద్యసేవలు అందిస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ద్వారా మందులు ఉచితంగా అందిస్తారు. జిల్లా ఆసుపత్రితో పాటు జిల్లాలోని సీహెచ్‌సీలు, అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలతో పాటు మందులు అందిస్తారు. శస్త్ర చికిత్స అవసరమైతే హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలిస్తారు.

### నేటి నుంచి సర్వే

కుష్ఠువ్యాధి కట్టడికి వైద్యారోగ్యశాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంటుంది. వ్యాధి గ్రస్తులను గుర్తించేందుకు నేటి నుంచి జిల్లాలో ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. డిసెంబరు 2 నుంచి 15వ తేదీ వరకు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటికే దీనిపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆశా, ఆరోగ్య కార్యకర్తలు ప్రతీ రోజు ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులందరినీ వ్యాధి లక్షణాలు ఉన్నాయా లేదని అని పరీక్షిస్తారు.

### మొదట్లోనే చికిత్స తీసుకోవాలి



శరీరంపై తెల్లని, రాగి రంగులో స్పర్శలేని మచ్చలు ఉన్నట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. దీనిని మొదట్లోనే గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా వ్యాధిని పూర్తిగా తగ్గించుకోవచ్చు. ఈ వ్యాధి సోకిన వారికి జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఉచితంగా మందులు అందిస్తారు.

**- డాక్టర్ పాపారావు, కుష్ఠు వ్యాధి నియంత్రణ జిల్లా అధికారి**

| గత నాలుగేళ్లలో జిల్లాలో నమోదైన కుష్ఠు వ్యాధి వివరాలు | | 2019-20 | 2020-21 | 2021-22 | 2022-23 | 2023-24 (అక్టోబరు వరకు) |
|---|---|---|---|---|---|---|
| | గుర్తించిన అనుమానితులు | 1,520 | 856 | 1,050 | 2,425 | 3,268 |
| | కుష్ఠు వ్యాధి నిర్ధారణ | పీబీ-15 | పీబీ-5 | పీబీ-9 | పీబీ-12 | పీబీ-6 |
| | | ఎంబీ-139 | ఎంబీ-68 | ఎంబీ-89 | ఎంబీ-171 | ఎంబీ-90 |
| | చికిత్స పూర్తి | పీబి-19 | పీబీ-9 | పీబీ-5 | పీబీ-15 | పీబీ-06 |
| | | ఎంబీ-145 | ఎంబీ-115 | ఎంబీ-77 | ఎంబీ-115 | ఎంబీ-74 |

# అన్నిరంగాల్లో తెలంగాణ అభివృద్ధి

- ప్రజాప్రతినిధులు, నాయకులు
- ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు
- పాఠశాలల్లో విద్యార్థులకు 'పునరుత్పాదక ఇంధన వనరులు' అంశంపై వ్యాసరచన పోటీలు.. విజేతలకు బహుమతులు అందజేత



ఇబ్రహీంపట్నం : బాలికల ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో ముందుకు తీసుకుపోతున్నారన్నారు. ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇబ్రహీంపట్నంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైనారు. పునరుత్పాదక ఇంధన వనరులు అనే అంశంపై వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులందజేశారు. జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, ఆర్డీవో కె.అనంతరెడ్డి, మండల ప్రత్యేకాధికారి నవీన్‌కుమార్‌రెడ్డి, చైర్‌పర్సన్ స్రవంతి, వైస్ చైర్మన్ మంగ, ఎంపీడీవో వెంకటమ్మ, మండల విద్యాధికారి హీర్యానాయక్, హెచ్‌ఎం లావణ్య పాల్గొన్నారు.

### విద్యతోనే ప్రగతి సాధ్యం

**కడ్తాల్ :** విద్యతోనే ప్రగతి సాధ్యమని భావించిన రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం బాలరాజు, ఎంఈవో సత్యనారాయణ, పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్ చైర్మన్ బాస్కర్ రెడ్డి, తదితరులు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాడ్గుల మండలంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలకు హాజరయ్యారు.

**ఆమనగల్లు :** ఆమనగల్లు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్యలు ముఖ్య అతిథులుగా పాల్గొని బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈవో పాండు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**తలకొండపల్లి :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో శ్రీకాంత్, తహసీల్దార్ నాగార్జున పోటీలను ప్రారంభించారు

**శంషాబాద్ :** మున్సిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ప్రజాపాలన-ప్రజా విద్య ఉత్సవాలు నిర్వహించారు. చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తహసీల్దార్ రవిందర్‌దత్ విద్యాధి కారి లక్ష్మన్‌నాయక్, హెచ్‌ఎం కృష్ణారెడ్డి టీచర్లున్నారు.

**షాబాద్ :** వ్యాసరచన పోటీలు విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీస్తాసేందుకు దోహదపడుతాయని ఎంపీడీవో అపర్ణ, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. షాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

**మొయినాబాద్ రూరల్ :** హిమాయత్ నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో సంధ్యారాణి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

**యాచారం :** గునగల్ మోడల్ స్కూల్లో 9,10 తరగతుల బాలికలకు పునరుత్పాదక ఇంధన వనరులు అనే అంశంపై మండలంలోని వివిధ గ్రామాల ఉన్నత పాఠశాలల బాలికలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంఈవో పాండు రంగారెడ్డి, ప్రిన్సిపాల్ లావణ్యతో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**చౌదరిగూడ :** విద్యార్థులు చదువుపై దృష్టిసారించి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని జిల్లేడ్ చౌదరిగూడ మండల తహసీల్దార్ జగదీశ్వర్ అన్నారు. ఉమ్మడి కొందుర్గు మండల పరిధిలోని చౌదరిగూడ, కేజీబీవీ, పెద్దఎల్కిచర్ల, ఎదిర, ముట్పూర్, కేజీబీవీ, కొందుర్గు ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. జిల్లేడ్ చౌదరిగూడ ఇన్‌చార్జి ఎంఈవో కిరణ్‌కుమార్‌రెడ్డి, కొందుర్గు ఇన్‌చార్జి ఎంఈవో గాయత్రీదేవి, కేజీబీవీ ప్రత్యేకాధికారి రాగసుధ, తదితరులు పాల్గొన్నారు.

**చేవెళ్ల :** విద్యార్థి దశలోనే పోటీతత్వం పెంపొందించుకోవాలని చేవెళ్ల ఎంపీడీవో హిమబిందు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఈవో పురందాస్, హెచ్‌ఎం రామారావు, సీఆర్పీలు తదితరులు ఉన్నారు.

**కేశంపేట :** కొత్తపేట జడ్పీహెచ్ఎస్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండలంలోని జడ్పీహెచ్ఎస్‌లకు చెందిన 70మంది విద్యార్థులు హాజరైనారు. ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్, ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

**కందుకూరు :** మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభకనపర్చిన విద్యార్థులకు మండల విద్యాధికారి హెచ్. జంగయ్య బహుమతిని అందజేశారు. కందుకూరు బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అంజయ్య, టీచర్లున్నారు.



కేశంపేట : విద్యార్థులతో ఇన్‌చార్జీ ఎంఈవో చంద్రశేఖర్, ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, టీచర్లు

## పంతూనాయక్ సేవలు చిరస్మరణీయం



పంతూనాయక్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కసిరెడ్డి, బాలాజీసింగ్

కడ్తాల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మనుషులు జీవిత కాలంలో చేసిన మంచి పనులు మరణాంతరం కూడా కీర్తించబడుతాయని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, గిరిజన సంఘాల నేతలు అన్నారు. అందుకు దివంగత ఆమనగల్లు మాజీ ఎంపీపీ రామావత్ పంతూనాయక్ గొప్ప నిదర్శనమని అన్నారు. ఆమనగల్లు మాజీ ఎంపీపీ, మైసిగండి మైసమ్మ దేవాలయ వ్యవస్థాపకులు, గిరిజన సేవా సంఘం రాష్ట్ర నాయకుడు దివంగత రామావత్ పంతూనాయక్ 17వ వర్ధంతి వేడుకలు కడ్తాల మండలం మైసిగండిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, గిరిజన నేతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పీసీబీ సభ్యుడు బాలాజీ సింగ్, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్‌చైర్‌పర్సన్ యాట గీతానర్సింహలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పంతూనాయక్ విగ్రహానికి, ఘాట్ వద్ద వివిధ పార్టీల, గిరిజన, ప్రజా సంఘాల నాయకులు అభిమానులు, ప్రజాప్రతినిధులు మాజీ ఎంపీపీ, పంతూనాయక్ సతీమణి సిరోలితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పంతూనాయక్ తనయుడు రామావత్ భాస్కర్‌నాయక్ అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో వారు మాట్లాడుతూ పంతూనాయక్ గొప్ప ఆశయ సాధకుడని కొనియాడారు. తహసీల్దార్ ఆర్.పీ. జ్యోతి, ఆరుణ్, సీత, సక్రి, డాక్టర్ ధ్రు, బుజ్జి, బిచ్చి, మైసమ్మ ఆలయ ఈవో స్నేహలత, నాయకులు తదితరులున్నారు. కడ్తాల మండల కేంద్రంలో యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్ ఆధ్వర్యంలో పంతూనాయక్‌కు నాయకులు నివాళులర్పించారు.



వర్ధంతిలో సిరోలిపంతూ, శ్రీనివాస్‌గౌడ్, గీతానర్సింహ, శ్రీనివాస్ రెడ్డి

## రజక సంఘాల అభివృద్ధికి నూతన కమిటీలు

చేవెళ్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రజక సంఘం అభివృద్ధి కోసం అన్ని గ్రామాల్లో నూతన కమిటీలు వేసి సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని రజక సంఘం చేవెళ్ల మండల అధ్యక్షుడు వై. శివకుమార్ తెలిపారు. ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలో రజక సంఘం నూతన కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల గ్రామం నూతన అధ్యక్షుడిగా వై.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా బి. శ్రీనివాస్, ఎం. రాంచంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్. కుమార్, కోశాధికారిగా గోపాల్, కమిటీ సభ్యులను ఏక గ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రజకులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. రజక సంఘాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నూతన కమిటీలు ఎంతగానో దోహదం చేస్తాయని చెప్పారు. ప్రతీ గ్రామంలో నూతన కమిటీలు వేయడం దాదాపు పూర్తి కావచ్చిందన్నారు. సంఘం మండల ఉపాధ్యక్షుడు మల్లేశ్‌కుమార్, ఆలూర్ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి ఆశోక్‌కుమార్, తదితరులున్నారు.

## ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన



చేవెళ్ల : నివాళులర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఐక్య పోరాటాల ద్వారానే హక్కులు సాధ్యమని మాల మహానాడు జిల్లా నాయకులు కాలే మల్లయ్య, లండం చంద్రయ్య, గోరటి నర్సింహలు అన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వెనక్కి తీసుకోవాలని కోరారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం మాల సింహగర్జన నేపథ్యంలో మాల మహానాడు నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక చెన్నకేశవ స్వామి దేవాలయం వద్ద కాలె మల్లయ్య జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై నిర్వహించిన ర్యాలీలో మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సభకు తరలి వెళ్లారు.

**చేవెళ్ల :** నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో మాలల సింహగర్జన సభకు చేవెళ్ల మండలం నుంచి మాలలు భారీగా తరలివెళ్లారు. అంతకుముందు చేవెళ్లలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలు వేసి నివాళుర్పించారు.

**కందుకూరు :** నగరంలో నిర్వహించిన మాలల సింహగర్జనకు మండల కేంద్రం నుంచి ఆ సంఘం నేతలు భారీగా తరలివెళ్లారు. మండల శాఖ అధ్యక్షుడు జి.కుమార్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నాయకులు హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం వాహనాలలో నగరానికి తరలివెళ్లారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్, రాచులూరు నాయకులు గుయ్యని యాదగిరి, రాజు, తదితరులున్నారు.

**యాచారం :** మాలల సింహగర్జన సభకు మండలంలోని వివిధ గ్రామాల కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. అంతకుముందు మండల కేంద్రంలో అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాంల విగ్రహాలకు నివాళులర్పించారు. కృష్ణమూర్తి, నర్సింహారావు, జైభీం ఎడ్యుకేటెడ్ యూత్ జిల్లా నాయకులు మరాటివివేక్, కిరణ్‌కుమార్‌లు తదితరులు తరలివెళ్లారు.

**షాబాద్:** మాలలు సంఘటితమై తమ హక్కుల సాధనకు పోరాడుదామని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. షాబాద్ నుంచి నాయకులు నగరానికి తరలివెళ్లారు. మాల సంక్షేమ సంఘం నాయకులు పెంటయ్య, రాంచందర్, కృష్ణ, వెంకటేష్, బాల్‌రాజ్, నర్సింహులు, మహేందర్, మల్లేష్, ప్రవీణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**కేశంపేట :** మాల మహానాడు ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన మాలల సింహగర్జనకు మండలం నుంచి పెద్దఎత్తున మాలలు తరలివెళ్లారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న సభకు మాలలు తరలివెళ్తున్నట్లు తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన మాల మహానాడు నాయకుడు మంగనూర్ రాంచంద్రయ్య తెలిపారు. భీమయ్య, బుచ్చయ్య, నారాయణ, నర్సింహ, యాదయ్య, మల్లయ్య, అంజనేయులు, తదితరులున్నారు.

## క్రైం కార్నర్

### రెండు బైకులు ఢీ.. వ్యక్తి మృతి

శంకర్‌పల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహాలింగపురం గ్రామానికి చెందిన ఫకీర్‌పాష(60) వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆదివారం సాయంత్రం పూట వ్యక్తిగత పని నిమిత్తం బైకుపై శంకర్‌పల్లికి బయలుదేరాడు. ఈక్రమంలో మహాలింగపురం గ్రామానికి చెందిన భీమ్‌రావ్ బైకుపై శంకర్‌పల్లి నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. రెండు బైకులు గ్రామ సమీపంలోని కల్వర్టు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. గ్రామస్తులు అంబులెన్సులో శంకర్‌పల్లిలోని విజయ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఫకీర్‌పాష మృతిచెందాడు. మృతదేహాన్ని పోలీసులు చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నారు. భీమ్‌రావ్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## సంక్షిప్తంగా..

**చేవెళ్ల :** శంషాబాద్ మండల పరిధిలో ఉన్న ఓయాసిస్ స్కూల్ లో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆలూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జి. భరత్, బి. శృతి మాథ్యమెటిక్స్, కంప్యూటర్స్ విభాగంలో ఇద్దరు జిల్లా స్థాయిలో మొదటి బహుమతి సాధించారు. రాష్ట్రస్థాయిలో జరిగే వైజ్ఞానిక ప్రదర్శనకు ఇద్దరు విద్యార్థులు అర్హత సాధించారని టీచర్లు చెప్పారు.

**ఆమనగల్లు :** ఆమనగల్లు పట్టణంలోని ఎమ్మార్పీ భవనం వద్ద మండల స్థాయి షటిల్ టోర్నమెంట్ ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఆమనగల్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారు. క్రీడాకారులు షటిల్ టోర్నమెంట్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణనాయక్, ప్రధాన కార్యదర్శి కొత్త మల్లేశ్ లు టోర్నమెంట్‌ను ప్రారంభించారు. తొలిరోజు షటిల్ టోర్నమెంట్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన పది టీంలు పాల్గొన్నారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వెంకటేశ్, గౌరవ సలహా దారు పర్వతాలు, ఉపాధ్యక్షుడు తిరుపతి, ప్రసాద్, కోశాధికారి రవి, సభ్యులు జంగయ్య, జగన్, గిరి, శివకుమార్, అన్వేష్, దేవేందర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

**షాద్‌నగర్ రూరల్ :** ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో నిర్మించిన సీతారాముడు, లక్ష్మణుడి వెండి విగ్రహాల తయారీకి భారీ విరాళం అందించారు. గ్రామానికి చెందిన దివంగత దుంపల బొవయ్య సతీమణి నాగమణి, కుమారులు జగన్, రమేష్ రూ.1.50 లక్షలు విరాళం అందించారు. ఆలయంలో కమిటీ సభ్యులకు నగదు అందించారు. దాతలను ఘనంగా సన్మానించారు.

**షాద్‌నగర్ :** షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని దత్తాత్రేయ ఆలయంలో ఆదివారం బీఆర్ఎస్ యువ నాయకులు నందారం అశోక్ యాదవ్ సీసీ కెమరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాద్‌నగర్ పోలీసుల సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇటీవలి కాలంలో ఆలయాల్లో చోరీలు పెరిగడం బాధాకరమన్నారు. ఆలయాలలో చోరీలను అరికట్టేందుకు దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు.

**శంషాబాద్ :** సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేష్ గుండెపోటుతో మృతిచెందడం పట్ల ఆ పార్టీ నాయకులు సంతాపం ప్రకటించారు. ఈ మేరకు సీపీఐ మండల శాఖ శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని అంబేడ్కర్‌చౌరస్తాలో ఆదివారం బాలమల్లేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ బాలమల్లేష్ పార్టీకి అందించిన సేవలను కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని తెలిపారు. అంతకు ముందు చిత్రపాటానికి పార్టీ నాయకులతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామస్వామి, నర్రాగిరి, పట్లాటి యాదయ్య, చంద్రప్రచండ, జంగయ్య, మంజుల మోహన్‌రెడ్డి తదిరులు పాల్గొన్నారు.

**కందుకూరు/కడ్తాల్ :** మండలంలోని రాచులూరుకు చెందిన బేతు రాఘవేందర్‌రెడ్డి గురుస్వామి ఆదివారం ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన 18వ మెట్టు మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహేశ్వరం, కడ్తాల మండలాల నుండి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అర్జున అవార్డు గ్రహీత వెదిరె రవికాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కడ్తాల మండలం రావిచెడ్‌లో మహాపడి పూజ నిర్వహించారు. గురుస్వాలు చంద్రమోహన్ నాయర్, లక్ష్మారెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజలో అయ్యప్ప భక్తులు, మాలధారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**కందుకూరు :** లేమూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 9వ తరగతికి చెందిన దివ్య జిల్లా స్థాయి ఇన్స్పైర్ అవార్డుకు ఎంపికైనట్లు వైస్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. ఆదివారం విద్యార్థిని అభినందించారు.

**ఆమనగల్లు :** ఆలయాల్లో భక్తుల వసతుల కల్పనకు దాతలు ముందుకు రావాలని పలువురు నాయకులు పిలుపు నిచ్చారు. దైవ కార్యక్రమాలలో ప్రతీ ఒక్కరు పాలు పంచుకోవాలని వారు కోరారు. ఆమనగల్లు పట్టణ సమీపంలోని అంతిరింతిరి కొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి జంగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన ఉప్పల అనూషఆనంద్ యాదవ్ దంపతులు రూ.26 వేలు విరాళం అందించారు. ఆ డబ్బుతో గణపతి, శివాలయంలో టైల్స్ నిర్మాణం చేపట్టారు. ఆదివారం ఈ మేరకు దాత అనూష ఆనంద్ దంపతులను ఆలయ నిర్వాహకులు సత్కరించి అభినందించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**యాచారం :** ఉపాధ్యాయులే సమాజ సేవకులని, ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించి ఆదుకోవాలని పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులగం దామోదర్‌రెడ్డి, ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సామ లమహేందర్‌రెడ్డిలు అన్నారు. ఇటీవల రంగారెడ్డి జిల్లాలో కొత్తగా విధుల్లో చేరిన 345 మంది ఉపాధ్యాయులకు టీఏన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి అందించిన నూతన సర్వీస్ బుక్‌లను వారు ఉపాధ్యాయులకందించారు. చెన్నకేశవరెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులున్నారు.